

## గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు

- పరిశీలించిన మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

**కొల్చారం, డిసెంబర్ 20(సిరిన్యూస్)** ఈ నెల 22 వ తేదీన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మెదక్ చర్చి, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ శుక్రవారం నాడు ఏర్పాట్లను పరిశీలించారు. గవర్నర్ పర్యటన రూట్ మ్యాప్ ను ప్రకారం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. గవర్నర్ రాక మొదలుకుని , కార్యక్రమాలు పూర్తిచేసుకుని తిరిగి బయలుదేరే వరకూ షెడ్యూల్ ప్రకారం పర్యటన సాగేలా ఏర్పాట్లను గురించి చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, కొల్చారం తహసిల్దార్ గఫర్, ఎంపీడీవో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## అక్రమ నిర్మాణాల కూల్చివేత

**జిన్నారం, డిసెంబర్ 20(సిరిన్యూస్)** జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీలో సర్వే నెంబర్ 284 లో పార్కు కోసం కేటాయించిన స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. మున్సిపల్ పరిధిలోని సర్వేనెంబర్ 284లో పార్కు కోసం గతంలో స్థలం కేటాయించారు. కాగా కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ మంగతాయారుకు శుక్రవారం పలువురు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె టౌన్ ప్లానింగ్ అధికారులకు అక్రమ నిర్మాణ కూల్చివేత పై ఆదేశాలు ఇచ్చారు. జేసీబీతో టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను నేలమట్టం చేశారు. సంబంధిత వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

## సంగారెడ్డిలో జగ్గారెడ్డి పాదయాత్ర



**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 20(సిరిన్యూస్)** ఈనెల 21న ఉదయం 10 గంటలకు సంగారెడ్డి ఐబి నుండి అంబేద్కర్ విగ్రహం వరకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి పాదయాత్ర నిర్వహించన ఁన్నారు. పార్లమెంట్ లో అంబేద్కర్‌ను అవమానపరుస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా, పార్లమెంట్ లో రాహుల్ గాంధీ చేస్తున్నపోరాటానికి మద్దతుగా సంగారెడ్డిలో జగారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంగారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్ తెలిపారు.

# నూతన మెనూ ఎలా ఉంది!

- మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా ?
- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి
- రంజోల్ గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

**జహీరాబాద్, డిసెంబర్ 20(సిరిన్యూస్)** నూతన మెనూ ఎలా ఉంది.. మెనూ ప్రకారం గురుకుల పాఠశాలలో వంటలు వండుతున్నారా.. నాణ్యతతో కూడిన భోజనం పెడుతున్నారా అంటూ విద్యార్థులను ప్రశ్నించి, విద్యార్థుల సమస్యలను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలుసుకున్నారు. శుక్రవారం జహీరాబాద్ మండలం రంజోల్ బాలికల గురుకుల పాఠశాల ను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశము వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతన మెనూ అమలుపై ప్రశ్నలను విద్యార్థుల ను అడిగి సమాధానం రాబట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంటగది స్టోర్ రూమ్, కూరగాయలు బియ్యం చింతపండు తదితర సామాగ్రి ఎలా ఉందని కలెక్టర్ పరిశీలించారు విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం భోజనాలు అందించాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. ఈ తనిఖీలో జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి. మండల ప్రతేక్య అధికారి బిక్షపతి, ఎంపీడీఓ, తహసీల్దార్, ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

### గ్రంథాలయ పుస్తకాలు విద్యార్థులు చదివేలా చూడాలి



**మునిపల్లి, డిసెంబర్ 20(సిరిన్యూస్)** గ్రంథాలయాల ప్రాముఖ్యత విద్యార్థులకు తెలిపి విద్యార్థులు గ్రంథాలయ పుస్తకాలను చదివేలా చూడాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం కంకోల్ ప్రాథమిక పాఠశాలలో రీడ్ టు రూమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకటవ తరగతి విద్యార్థుల పైన ఉపాధ్యాయులు ఎక్కువగా దృష్టి పెట్టాలని దానితో పాటుగా గ్రంథాలయ పుస్తకాలను కూడా వాడాలని తెలిపారు. గ్రంథాలయం యొక్క ప్రాముఖ్యత వాటి నిర్వహణ గురించి చర్చిస్తూ ప్రతిరోజు పిల్లలు టైం టేబుల్ ప్రకారం గ్రంథాలయ పుస్తకాలను సద్వినియోగం చేసుకోనేలా చూడాలని కలెక్టర్ సూచించారు. లైబ్రరీకి సంబంధించి మెటీరియల్స్ గురించి డీకోటబుల్ బుక్స్ ఒకటవ తరగతి చదువుతున్నవిద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శైలజ, ఉపాధ్యాయులు సంతోష్, వినోద్ మనిత రాణి, దేవిక, లావణ్య, రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్, తేజస్విని , లిటరసీ ఫెసిలిటేటర్ సంధ్య, విజయశ్రీ ,రవి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కుట్రలో భాగమే కేటీఆర్‌పై కేసు

- బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి



**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 20(సిరిన్యూస్)** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఉద్దేశపూర్వకంగానే అక్రమ కేసులు నమోదు చేసి నిందితునిగా చూపాలని ప్రభుత్వం కుట్ర చేస్తుందని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ..ఫార్ములా ఈ రేసులో ఎలాంటి అవినీతి జరగలేదని ఎఫ్ఈవో సంస్థ చెప్పిందని తెలిపారు. ఫార్ములా ఈ రేసుపై అసెంబ్లీ లో చర్చ పెట్టాలని డిమాండ్ చేస్తే ఎందుకు పెట్టడం లేదని, చేతనైతే చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కేసును న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో కేటీఆర్ పై కుట్రపూరితంగా అక్రమ కేసులు పెట్టాలని రేవంత్ సర్కార్ ప్రయత్నిస్తుందన్నారు. రాష్ట్ర మంత్రులే సిఐడి ఆఫీసర్లు, పోలీసుల్లా ప్రవర్తిస్తున్నారని, ప్రభుత్వానికి అవగాహన లేకపోవడం వల్లే ఫార్ములా ఈ రేసు పై అక్రమ కేసులు పెట్టి కేటీఆర్ ను నిందితునిగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ సిడీసి ఛైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, జైపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్, కార్యదర్శి నర్సింలు, డాక్టర్ శ్రీహరి, విజేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, జీవి శ్రీనివాస్, మల్ల గౌడ్, ఎర్రోళ్ల చిన్న, పరశురాం నాయక్ పాల్గొన్నారు.

## గౌరవ డాక్టరేట్ అవార్డుకు ఎంపికైన శివరామకృష్ణ



**హత్నూర, డిసెంబర్ 20(సిరి న్యూస్)** హత్నూర మండలం నాగారం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు, జాతీయ సేవారత్న కోటగల్ల శివరామకృష్ణ గౌరవ డాక్టరేట్ అవార్డుకు ఎంపికయ్యారు.సేవా దృక్పథంతో వారు చేస్తున్న వివిధ సామాజిక కార్యక్రమాలను గుర్తించి ఆసియా వేదిక్ అంతర్జాతీయ సంస్కృతి పరిశోధన స్ఫూర్తి అకాడమీ ఈ అవార్డుకు ఎంపిక చేశారు.ఓ వైపు సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూనే,మరోవైపు బిఆర్ఎస్ పార్టీ యువనాయకుడిగా,సునితమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పని చేస్తున్నారు. ఈ నెల 28న సికింద్రాబాద్ లోని స్ఫూర్తి కల్చరల్ ఆడిటోరియంలో సంస్థ నిర్వాహకులు ఆకుల రమేష్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అవార్డును అందుకోనున్నట్లు శివరామకృష్ణ తెలిపారు.

## నాలుగు రోజులు ఏపీజీవీబీ సేవలు బంద్

**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 20(సిరిన్యూస్)** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ జనవరి 1 నుంచి తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ గా సేవలందిస్తుందని రీజినల్ మేనేజర్ సమత అన్నారు. సంగారెడ్డి లోని ఆర్.ఎం కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 28 నుంచి 31 వరకు బ్యాంకు సేవలు నిలిపివేస్తున్నట్లు చెప్పారు. జనవరి 1 నుంచి కొత్త ఏటీఎం చెక్కులు జారీ చేస్తామని పేర్కొన్నారు.



## ఎస్ఐ కృషితో రోడ్డు మరమ్మత్తులు

- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు
- రోడ్డు నిబంధనలు పాటించాలి

**ఝరాసంగం, డిసెంబర్ 20(సిరి న్యూస్):** ఝరాసంగం మండలంలోని మాచునూర్ గ్రామ శివారు నుంచి కుప్పానగర్, ఝరాసంగం వరకు రోడ్డుపై ఉన్న ప్రమాదకరమైన గుంతలను గుర్తించి శుక్రవారం పోలీస్ సిబ్బందితో కలిసి కంకర, డాంబర్, వేసి మరమ్మత్తులు చేయించారు, రోడ్డుపై గుంతలు ఉండడంతో గతంలో వృద్ధులు, గర్భిణీ మహిళలు, రోగులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. వాహనదారులు నిర్లక్ష్యంగా కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని జాగ్రత్తగా వాహనాలను నడపాలని ఝరాసంగం ఎస్.ఐ టి.నరేష్ సూచించారు. ఇదే రోడ్డుపై జహీరాబాద్ నుంచి ఝరాసంగం, రాయికోడ్, అల్లాదుర్గం, మెదక్ తదితర ప్రాంతాలకు అనేక వాహనాలు బస్సులు కొనసాగుతూ ఉంటాయి. మండల కేంద్రంలో ఉన్న కేతకి సంగమేశ్వర దేవాలయానికి ప్రతినిత్యం వందల సంఖ్యలో వాహనాలు, భక్తులు రాకపోకలు కొనసాగిస్తూ ఉంటారు. ఎస్.ఐ రోడ్డు మరమ్మత్తులు చేయించడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

Published by **Badhe Jayasree** on behalf of **Siri Media**. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : **9697889922**. E-Mail : **siridailynews@gmail.com**.